క్లుప్తంగా

చౌడేశ్వరి ఆలయానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయానికి బీమవరం వాస్తవ్యులు దాట్ల నాగవెంకట రామకృష్ణంరాజు, పార్వతి దంపతుల మనవళ్లు క్రితిక్‌వర్మ, రుద్విక్‌వర్మ కుటుంబ సభ్యులు రూ.25,116 విరాళం ఇచ్చారు. శనివారం అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీకుమార్‌రెడ్డి, అర్చకులకు విరాళం అందజేశారు. దాతలను తీర్థప్రసాదాలతో సత్కరించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



పర్యావరణ పరిరక్షణపై ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కోవెలకుంట్ల: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని.. ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని హెచ్ఎం గీతా అన్నారు. శనివారం పట్టణంలోని సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలలో జేపీఐసీ గ్రీన్ డే కార్యక్రమం నిర్వహించారు. చెట్ల ప్రాముఖ్యత, పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అడవులు అంతరించిపోతున్న నేపథ్యంలో విద్యార్థులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టాలని సూచించారు.పీఈటీలు హర్ష, ఓబులేసు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాధ్యులను కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బరాయుడు

బనగానపల్లె రూరల్: చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవళంపేట గ్రామంలో రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను గుర్తించి, వారిని కఠినంగా శిక్షించాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు కెడం సుబ్బరాయుడు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సంఘం నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. విగ్రహానికి నిప్పు పెట్టడం హేయమైన చర్య అన్నారు. దీనికి కారణమైన వారిపై వెంటనే కేసులు నమోదు చేయాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘం నాయకులు పి.బాలమద్దయ్య, చిన్నరాయుడు, కంబయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు



గాయపడిన వెంకటయ్య

అవుకు(కొలిమిగుండ్ల): మండల పరిధిలోని కొట్టాల సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలయ్యాయి. బనగానపల్లె పట్టణంలోని తెలుగుపేటకు చెందిన వెంకటయ్య బైక్‌పై వెళుతున్నాడు. మార్గమధ్యలోని కొట్టాల వద్ద ఆగివున్న ఎరువుల ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు చికిత్స నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కోవెలకుంట్ల: మండలంలోని భీమునిపాడు సమీపంలో ప్రవహిస్తున్న కుందూనదిలో శనివారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి వివరాల మేరకు.. మృతుడు సుమారు 40 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగి ఉన్నాడు. వైట్‌కలర్ జిబ్బా తరహాలో ఫుల్‌షర్ట్, ఎర్ర మొలతాడు కలిగి శరీరమంతా గుర్తు పట్టడానికి వీలు లేనంత ఉబ్బి ఉంది. నాలుగు రోజుల క్రితం నంద్యాల ప్రాంతం వైపు నుంచి నదిలో కొట్టుకొచ్చినట్లు తెలుస్తోంది. ఆచూకీ తెలిసిన వ్యక్తులు 9121101173, 9121101174 నంబర్లకు సమాచారం అందించాలని ఎస్ఐ సూచించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

ప్యాపిలి: ట్రాక్టర్ ఢీకొని తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ప్యాపిలిలో జరిగిన దసరా ఉత్సవాల్లో స్థానికంగా ఉంటున్న మలిగె ఖాజా హుసేన్ (50)పైకి ట్రాక్టర్ దూసుకురావడంతో తీవ్రగాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతన్ని కర్నూలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో కోలుకోలేక మృతి చెందాడు. మృతునికి భార్య మోసీనా, కుమారుడు, కుమార్తె సంతానం. ఏటా దసరా ఉత్సవాల్లో భాగంగా ప్యాపిలిలో నిర్వహిస్తున్న ఎడ్లబండ్ల పరుగులు, అతి వేగంతో ద్విచక్రవాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లను నడపడం ద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయి.

బస్సుల్లో కష్టాలు ఉచితం!

- ఉచిత ప్రయాణంతో కిక్కిరిసిపోతున్న బస్సులు
- బస్సుల సంఖ్య తగ్గించడంతో ప్రయాణికుల ఉక్కిరిబిక్కిరి
- బస్టాప్‌లోనే గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి
- రిక్వెస్టు స్టాప్‌లలో ఆగని వైనం
- నిత్యం గొడవలతో సతమతమవుతున్న కండెక్టర్లు, డ్రైవర్లు



డోన్ ఆర్టీసీ బస్టాండ్‌లో మహిళా ప్రయాణికుల రద్దీ (ఫైల్)

డోన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం ప్రజలకు నరకం చూపిస్తోంది. బస్టాండ్‌లు, బస్టాప్‌లలో సీట్లు కోసం తోటి ప్రయాణికులతో కుస్తీ పడాల్సిన పరిస్థితి నెలకొంది. స్త్రీశక్తి పేరుతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ప్రయాణం ప్రయాణికులకు అగ్నిపరీక్షగా మారింది. వివిధ పనుల కోసం మండల కేంద్రాలకు వెళ్లాల్సిన ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు బస్సుల్లోని రద్దీ కారణంగా ఉక్కిరిబిక్కిరవుతున్నారు. డోన్ ఆర్టీసీ బస్టాండ్ నుంచి బయలుదేరే బస్సులు వెల్దుర్తి, ప్యాపిలి వంటి కేంద్రాల్లో ఆగకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా సర్వీసులను తగ్గించడంతో ప్రయాణికుల సమయం వృథా అవుతోంది. సహనం కోల్పోయి ప్రభుత్వాన్ని ఈసడించుకునే పరిస్థితి ఏర్పడింది.

రిక్వెస్ట్ స్టాప్‌లలో బస్సులు ఆగడంలేదు

డోన్–కర్నూలు, డోన్–అనంతపురం (వయా గుత్తి) మార్గాల్లో రిక్వెస్ట్ స్టాప్‌ల వద్ద బస్సులు ఆగకపోవడంతో ప్రయాణికులు గంటల తరబడి బస్సుల కోసం వేచిచూడాల్సి వస్తోంది. అప్పటికే బస్సులు కిక్కిరిసిపోవడంతో డ్రైవర్లు మార్గమధ్యలో ఆపడానికి వెనుకాడుతున్నారు. దీంతో తరచుగా ప్రయాణికులు, కండక్టర్లు, డ్రైవర్ల మధ్య వాగ్వాదాలు చోటుచేసుకుంటున్నాయి. డబ్బులిచ్చి బస్సు ఎక్కుదామంటే కూడా బస్సుల్లో రద్దీ చూసి భయపడాల్సిన పరిస్థితి నెలకొంది.

బస్సుల్లో ప్రయాణమంటేనే భయం

గతంలో బస్సుల్లో ప్రశాంతంగా ప్రయాణం చేసేవాళ్లం. ఇప్పుడు నరకం చూస్తున్నాం అని కొందరు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉచిత ప్రయాణం కారణంగా మహిళలు అధిక సంఖ్యలో బస్సులను వినియోగించడంతో ఆర్టీసీ సర్వీసులను కూడా తగ్గించింది. కర్నూలులోనే బస్సులు కిక్కిరిసిపోతుండడంతో ఉలిందకొండ, వెల్దుర్తి తదితర ప్రాంతాల్లో ఆపడానికి డ్రైవర్లు సాహసించడం లేదు. డోన్‌కు చేరుకునే వరకు బస్సులు ఎక్కడా ఆగకపోవడంతో మార్గమధ్యలో ప్రయాణించేవారు నరకం చూస్తున్నారు.



డ్రైవర్ సీటు నుంచి బస్సులోకి ఎక్కేందుకు ప్రయత్నిస్తున్న మహిళలు (ఫైల్)

డోన్ డిపోలో బస్సుల సంఖ్య	- 52
సర్వీసు ఉన్న గ్రామాల సంఖ్య	-120
రోజుకు బస్సులు తిరిగే కిలోమీటర్లు	-18 వేలు
ప్రతిరోజూ డోన్ ఆర్టీసీ డిపో కలెక్షన్	-రూ.7లక్షలు
రోజూ ప్రయాణించే మహిళల సంఖ్య	-సుమారు 8 వేలు
రోజులో డోన్ డిపోకు తగ్గిన ఆదాయం	-రూ.3.24 లక్షలు
ప్రతి కి.మీ ఆర్టీసీ నష్టం	-రూ.18

బస్సు ప్రయాణం అంటేనే భయం



ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రకటించినప్పటి నుంచి బస్సుల్లో మగవారు ప్రయాణించాలంటేనే భయమేస్తోంది. ఏ బస్సు చూసినా మహిళలతో కిక్కిరిసి ఉండడంతో పురుషులకు కనీసం నిలబడేందుకు కూడా చోటు లభించడం లేదు. బస్సు కుదుపులకు పొరపాటున ఎవరికైనా తగిలినా గొడవలు జరుగుతున్నాయి. చంటి పిల్లలతో ఉన్న మహిళలు, వృద్ధుల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. గతంలో ఏ బస్టాప్‌లో నిలబడి చేయి ఎత్తినా బస్సులు ఆగేవి. అలాంటిది ప్రస్తుత పరిస్థితుల్లో సీట్లు లేవు.. వెనుక బస్సుల్లో రండి అని ఆపకుండా వెళ్తున్నారు. దీనికి కారణం బస్సుల సంఖ్యను ప్రభుత్వం పెంచకపోవడమే.

–మహేశ్వరరెడ్డి, సర్పంచ్, హుసేనాపురం

గంటలకొద్దీ వేచి ఉండాల్సి వస్తోంది



నేను కుటుంబ సభ్యులతో అనంతపురం వెళ్లేందుకు స్థానిక అమ్మ హోటల్ బస్టాప్ వద్ద బస్సు కోసం గంటల కొద్దీ వేచిచూశాం. బస్టాండ్ నుంచే ప్రయాణికులతో బస్సులన్నీ కిక్కిరిసిపోయాయి. కండెక్టర్లు సీట్లు ఖాళీ లేవు వెనుక బస్సు వస్తుందంటూ ఆపకుండా వెళ్లారు. ఇలా కళ్ల ముందే ఐదారు బస్సులు వెళ్లిపోతున్నా నిస్సహాయులుగా విలువైన సమయాన్ని రోడ్డుపై వృథా చేసుకున్నాం. ప్రభుత్వం ఉచిత బస్సు అని చెప్పిందే తప్ప ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచకపోవడం దుర్మార్గం. –శ్రీజయ, గృహిణి, డోన్

ఇలా అయితే ప్రయాణం ఎలా?



నేను వెల్దుర్తి నుంచి డోన్‌కు వచ్చేందుకు బస్టాండ్‌లో వేచివున్నాను. ఎన్ని బస్సులు వచ్చినా కూడా బస్సులో నిలబడేందుకు కూడా జాగా లేదు. వెనుక బస్సు ఖాళీగా వస్తోందంటూ డ్రైవర్లు, కండెక్టర్లు చెప్పి వెళ్లిపోయారు. ఉచిత బస్సు సర్వీసు అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచకుండా ప్రయాణికుల సహనానికి పరీక్ష పెట్టడం భావ్యంగా లేదు. సకాలంలో గమ్యస్థానాలకు చేరుకోలేక మాలాంటి వారు పడుతున్న బాధలు వర్ణనాతీతం. ఇలా అయితే ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం ఎలా చేయాలి. –గోకుల్‌లక్ష్మి, ఎంపీపీ, ప్యాపిలి

7న వాల్మీకి జయంతి ఉత్సవాలు



సమావేశంలో మాట్లాడుతున్న వాల్మీకి సంఘం నేతలు

డోన్: వాల్మీకి మహర్షి జయంతి ఉత్సవాలు ఈనెల 7న ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి శీలం భాస్కర్‌నాయుడు, కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వలసల రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుప్రసాద్ తెలిపారు. స్థానిక వాల్మీకి మహర్షి విగ్రహం వద్ద సంఘం జిల్లా కార్యదర్శి పూల శ్రీను ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వం వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చుతామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని తెలిపారు. జయంతి కార్యక్రమంలో ఈ అంశాన్ని ప్రధానంగా చర్చిస్తామన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీరాములు, శివరామకృష్ణ, కృష్ణమూర్తి, రాజేష్, సంఘం నాయకులు ధర్మవరం నాయుడు, పాలరాజు, మహేంద్రనాయుడు, డీలర్ కృష్ణ, ఆర్ట్ రమణ, ఆర్మీ రామయ్య, కేశవయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో ఆర్థిక ప్రయోజనం



బ్రోచర్లను విడుదల చేస్తున్న అధికారులు

డోన్ టౌన్: కేంద్ర ప్రభుత్వం వివిధ వస్తువులపై జీఎస్టీ తగ్గించడంతో పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతోందని నంద్యాల జిల్లా పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ మహబూబ్‌బాషా, జీఎస్టీ అధికారి లక్ష్మీనాయక్, శివప్రసాద్ అన్నారు. సూపర్ జీఎస్టీ– సూపర్ సేవింగ్స్ అనే కార్యక్రమంలో భాగంగా శనివారం బ్రోచర్లను విడుదల చేశారు. అనంతరం పట్టణ సమీపంలోని కోట్లవారిపల్లెలో సవరించిన జీఎస్టీ స్లాబ్‌లను వివరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పారిశ్రామికవేత్తలు లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



డోన్‌లో అమ్మవారి దర్శనం



డోన్: వాసవీమాత గ్రామోత్సవం

వైభవం.. దుర్గామాత నిమజ్జనం



బేతంచెర్ల: హనుమాన్‌నగర్‌లో కళాకారులు ప్రదర్శించిన అమ్మవారి శక్తి రూపాలు

డోన్ టౌన్: దసరా ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాలకు శనివారం గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం వెంకటాపురం (పల్లె) తుమ్మల చెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా వాసవీమాత, కనకదుర్గమ్మ, అలాగే కౌన్సిలర్ దినేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహాలను పట్టణ పురవీధుల మీదుగా మేళతాళాలతో అంగరంగ వైభవంగా ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. అలాగే స్థానిక అమ్మవారిశాలలో ఆర్యవైశ్య సంఘం, ఆవోపా ఆధ్వర్యంలో వాసవీమాత అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తోటలోత్సవం (ఉయ్యాల) నిర్వహించారు. గత నెల 22న ప్రారంభమైన ఉత్సవాలు తోటలోత్సవంతో ముగిశాయి.

- బేతంచెర్ల: పట్టణంలోని సంజీవనగర్, హనుమాన్ నగర్, జంగాలపేట, శ్రీనగర్, కొత్తపేట, వడ్డెపేటతో పాటు 11 చోట్ల దుర్గామాత ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించారు. శనివారం పట్టణంతో పాటు సిమెంట్‌నగర్, సీతారామాపురం, ఆర్.ఎస్. రంగాపురంలో నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి. చెక్కభజనలు, కళాకారుల వేషధారణలు, డప్పు వాయిద్యాల నడుమ ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకెళ్లారు. సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ రమేష్‌బాబు పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వాసవీమాత తెప్పోత్సవం

పట్టణంలోని అమ్మవారిశాలలో శనివారం వాసవీమాత తెప్పోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఆర్యవైశ్యులు, వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో అభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు. చిన్నారుల సంప్రదాయ నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆర్యవైశ్య సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడు బింగిమల్ల శ్యాంసుందర్ గుప్తా, గౌరవాధ్యక్షుడు కండె శ్యాంసుందర్‌లాల్ హాజరయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. సంఘం నాయకులు గుండా గోపాలు, కందగడ్డల జనార్దన్, రాజేంద్ర, విష్ణు, బళ్లాని సూర్య, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



దుర్గామాత ఊరేగింపునకు తరలివచ్చిన భక్తులు



ఆకుమల్లలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

- సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలో దుర్గామాత గ్రామోత్సవం ఘనంగా జరిగింది. చివరి రోజు దుర్గాదేవి అలంకరణలో దర్శనం ఇచ్చారు. మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అనంతరం అమ్మవారిని ట్రాక్టర్‌పై ఊరేగింపుగా తీసుకెళ్లి ముదిగేడు పాలేరు వాగులో నిమజ్జనం చేశారు.
- ప్యాపిలి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం వాసవీమాత గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయం నుంచి పట్టణ ప్రధాన వీధుల మీదుగా ఊరేగింపు సాగింది. భక్తులు పరస్పరం రంగులు చల్లుకుంటూ సందడి చేశారు. ఆర్యవైశ్య సంఘం నేత రాజా మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలను ఇబ్బంది పెడితే ఊరుకోం

- కూటమి పాలన అట్టర్ ఫ్లాప్
- మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, భూమా కిశోర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

సంజామల: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులను ఇబ్బంది పెట్టే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హెచ్చరించారు. శనివారం సంజామల మండలం గిద్దలూరు ఫంక్షన్ హాల్‌లో పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పార్టీ బనగానపల్లె, నంద్యాల నియోజకవర్గాల పరిశీలకుడు భూమా కిశోర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గుండం సూర్యప్రకాశ్ రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ మల్కిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి చిన్న బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందన్నారు. అయితే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు మోపడంలో మాత్రం విజయం సాధించిందని ఎద్దేవా చేశారు. టీడీపీ నాయకులే దాడులు చేసి, తమ పార్టీ కార్యకర్తల మీదే కేసులు పెడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో దాడులు, కేసులు తప్ప మరే పాలన జరగడం లేదని మండిపడ్డారు.

సూపర్ సిక్స్ కాదు సూపర్ ఫ్లాప్!

కూటమి ప్రభుత్వం ఏడాదిన్నర కాలంగా అధికారంలో ఉన్నా ప్రజలకు ఏమీ ఒరగలేదని దుయ్యబట్టారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం అని గొప్పలు చెప్పారు.. రాయితీ వేయకుండా మోసం చేశారని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధర, ఉచిత బీమా, ఇన్‌పుట్ సబ్సిడీలన్నీ రద్దు చేశారన్నారు. అన్నదాత సుఖీభవలో కూడా కొందరికే డబ్బులు జమ చేశారని ఆరోపించారు. మహిళలకు ఉచిత ప్రయాణ పథకాన్ని నామమాత్రంగా అమలు చేస్తున్నారని.. అరకొర బస్సులతో ఆర్టీసీ ఉద్యోగులకు, ప్రయాణికులకు నరకం చూపిస్తున్నారని తెలిపారు. నిరుద్యోగులకు రూ.3 వేలు ఎక్కడ? కౌలు రైతులకు భరోసా ఎక్కడ? పేదలకు ఇళ్లు ఎక్కడ? ప్రతి వర్గానికి ఇచ్చిన హామీలు నెరవేర్చలేదు కానీ సూపర్ సిక్స్ సూపర్ హిట్ అంటూ గొప్పలు చెప్పుకుంటున్నారని మండిపడ్డారు.

డిజిటల్ బుక్కం కార్యకర్తలకు శ్రీరామరక్ష

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో వైఎస్ జగన్ డిజిటల్ బుక్ తీసుకొచ్చారని తెలిపారు. అన్యాయానికి గురైన ప్రతి కార్యకర్త ఇందులో వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఈ డిజిటల్ బుక్ కార్యకర్తలకు శ్రీరామరక్షలా పనిచేస్తుందని తెలిపారు. పార్టీ వెన్నంటి ఉంటుందని.. ఎలాంటి సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని భరోసా ఇచ్చారు. పార్టీ పరిశీలకుడు భూమా కిశోర్ రెడ్డి మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని.. కార్యకర్తలకు మంచి భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి, నాయకులు నాగేశ్వర్ రెడ్డి, బత్తుల రామచంద్రారెడ్డి, నరసింహారెడ్డి, రమేశ్‌రెడ్డి, శివరామిరెడ్డి, రహమతుల్లా, మధుసూదన్‌రెడ్డి, సూర్యనారాయణరెడ్డి, తులసిరెడ్డి, ఆల్వకొండ సాయి, ఓబులేశు, తోట వెంకటేశ్వర్ రెడ్డి, దారెడ్డి సుధాకర్‌రెడ్డి, అక్కంపల్లె నాగేశ్వర్‌రెడ్డి, ఖాశీం బాషా, ధర్మారెడ్డి, విజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

దర్గాలో ఫాతెహాల సమర్పణ



దస్తగిరిస్వామి దర్గాలో ఫాతెహాలు సమర్పిస్తున్న కాటసాని

బనగానపల్లె రూరల్: పట్టణంలోని బేతంచర్ల రోడ్డులో శనివారం దర్గా–ఎ–ఝుండే వాలే సాహెబ్ వారి గథం మహోత్సవం జరిగింది. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దర్గాను దర్శించి ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. మతగురువు అబ్దుల్‌సాహెబ్ కుటుంబ సభ్యులను సన్మానించారు. కొత్తగా నిర్మిస్తున్న దర్గా నమూనాను పరిశీలించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అంబటి రవికుమార్ రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, కాటసాని ప్రసాదరెడ్డి, కాటసాని తిరుపాల్ రెడ్డి, ముస్లిం నాయకులు అబ్దుల్‌కలాం, ముక్తియార్, ఇక్బాల్, సయ్యద్‌బాషా, షాషా, మహమ్మద్ హుస్సేన్ వలి ఉన్నారు.

శుభకార్యం

బనగానపల్లె: పట్టణంలోని పెండేకంటినగర్‌లో నివాసం ఉంటున్న యాగంటిపల్లె సర్పంచ్ (వైఎస్సార్‌సీపీ) బండి వరలక్ష్మీ బ్రహ్మానందరెడ్డి దంపతుల కుమారుడు బండి మహీధర్‌రెడ్డి వివాహము హూర్త కార్యక్రమం శనివారం జరిగింది. మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జయమ్మ దంపతులు హాజరై పెళ్లి కుమారుడిని ఆశీర్వదించారు.

పరామర్శ

సంజామల: మండల కేంద్రం సంజామలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు తోట వెంకటరామిరెడ్డి, నొస్సం గ్రామ నాయకుడు మల్కిరెడ్డి రఘురామిరెడ్డి కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి శనివారం రాత్రి వారిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు భూమా కిశోర్ రెడ్డి, గుండం సూర్య ప్రకాశ్‌రెడ్డి, మల్కిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కొలిమిగుండ్ల: కొలిమిగుండ్ల–బెలుం ప్రధాన రహదారిలోని గ్యాస్ గోడౌన్ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అనంతపురం జిల్లా యాడికి మండలం నిట్టూరుకు చెందిన రవి పని ముగించుకుని బనగానపల్లె వైపు నుంచి స్వగ్రామానికి బయలు దేరాడు. మార్గమధ్యలో గ్యాస్ గోడౌన్ వద్దకు చేరుకోగానే లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో కుడి కాలుకు తీవ్ర గాయమైంది. క్షతగాత్రుడిని 108 వాహన సిబ్బంది కొలిమిగుండ్ల పీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడు మృతి

బనగానపల్లె రూరల్: మండలంలోని నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలుకూరు గ్రామానికి చెందిన బోయ రామసుబ్బయ్య (35) చికిత్స నుంచి కోలుకోలేక కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో శనివారం మృతి చెందాడని ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. వివరాలు.. చెరువుపల్లె గ్రామంలో నివాసం ఉండే మృతుడికి నాలుగు సంవత్సరాల క్రితం ఎడమ కాలు ముళ్లు గుచ్చుకొని, పాదం మొత్తం సెప్టిక్ అయిపోయింది. వైద్యశాలల్లో చికిత్స పొందినా కాలు నయం కాలేదు. దీంతో మనస్తాపం చెందిన రామసుబ్బయ్య ఈ నెల 1వ తేదీ నందవరం గ్రామ శివారు ప్రాంతంలో క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, చికిత్స నుంచి కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్ఎస్‌కేలలో యూరియా పంపిణీ

కొలిమిగుండ్ల: రైతు సేవా కేంద్రాలకు మంజూరైన యూరియాను వ్యవసాయ శాఖ సిబ్బంది రెండు రోజుల నుంచి పంపిణీ చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి యూరియా ఆలస్యంగా మంజూరు కావడంతో చాలా మంది రైతులు ప్రైవేట్ డీలర్ల వద్ద కొనుగోలు చేశారు. కొలిమిగుండ్లకు 265 బ్యాగులు, తోళ్లమడుగు, బిడుప్పులూరు, నందిపాడుకు 536 బ్యాగుల చొప్పున వచ్చాయి. పెద్దవెంతుర్ల రైతు సేవా కేంద్రానికి రావాల్సి ఉంది. రైతుకు రెండు చొప్పున యూరియా అందించారు. వరి సాగు చేసే రైతులే కాకుండా ప్రస్తుతం రబీ సీజన్ కావడంతో శనగ రైతులు యూరియా ఉపయోగించనున్నారు.

15 నుంచి విద్యుత్ ఉద్యోగుల సమ్మె



ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

కోవెలకుంట్ల: తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ఈ నెల 15వ తేదీ నుంచి విద్యుత్ ఉద్యోగులు సమ్మెకు దిగుతున్నట్లు ఆ సంఘం జిల్లా జేఏసీ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, కృపవరం, మహేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట జేఏసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యుత్ ఉద్యోగులకు నగదు రహిత వైద్యం అందించాలని, 1999 నుంచి 2004 మధ్య కాలంలో చేరిన ఉద్యోగులకు పెన్షన్ సదుపాయం కల్పించాలని కోరారు. దళారీ వ్యవస్థను రద్దు చేసి కార్మికులకు నేరుగా వేతనాలు అందజేయాలన్నారు. సంఘం నాయకులు సతీష్‌కుమార్‌రెడ్డి, రామమోహన్, కుక్కలయ్య, కిరణ్, మోహన్, బాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.